సాక్షి
విశాఖపట్నం
సోమవారం । 31 । మార్చి । 2025



పరాకాష్టకు కూటమి అవినీతి
ఛీడీఆర్
టీడీఆర్‌ల పేరుతో టీడీపీ కార్పొరేటర్ వసూళ్ల పర్వం

- చదరపు మీటరుకు రూ.400 చొప్పున వసూలు
- మొత్తం రూ.1.76 కోట్లు రాబట్టుకోవాలని లక్ష్యం
- మంత్రులకు, అధికారులకు వినతిపత్రాల పేరుతో హంగామా

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

కూటమి ప్రభుత్వంలో అందులేదు.. ఇందులేదు.. ఎందెందు వెతికినా.. అంతా అవినీతి కంపే. అమాత్యుల నుంచి కార్పొరేటర్ల వరకు అవకాశాలు సృష్టించుకుని మరీ దోచుకోడానికి పోటీ పడుతున్నారు. రహదారుల కోసం ఇళ్లు, స్థలాలను త్యాగం చేసిన నిర్వాసితులను సైతం విడిచిపెట్టడం లేదు. బాధితులకు ఇచ్చే టీడీఆర్ బాండ్లలోను వసూళ్ల పర్వానికి తెరలేపడం వారి అవినీతి పరాకాష్టకు చేరుకుందనడానికి నిదర్శనం. ప్రధానంగా పాత గోశాల నుంచి అడవివరం జంక్షన్ వరకు బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణలో భాగంగా బాధితులకిచ్చే టీడీఆర్‌ల ద్వారా రూ.1.76 కోట్లు



వెనకేసుకోవాలని ఒక కార్పొరేటర్ సిద్ధమైపోయారు. ఇందుకోసం టీడీఆర్‌లో చదరపు మీటరుకు రూ.400 చొప్పున వసూలు చేసే ప్రయత్నాల్లో ఉన్నారు.

దశాబ్దన్నర కాలంగా...!

శీఘ్ర బస్సు రవాణా వ్యవస్థ(బీఆర్‌టీఎస్) పనులను డిసెంబర్ 2008లో ప్రారంభించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి మద్దిలపాలెం, హనుమంతవాక, సింహాచలం, వేపగుంటతో పాటు పెందుర్తి నుంచి మళ్లీ విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు రహదారుల అభివృద్ధి పనులు చేపట్టారు. 2014 నాటికి అన్ని ప్రాంతాల్లో పనులు పూర్తి కాగా.. అడవివరం నుంచి పాతగోశాల మధ్య 2 కిలోమీటర్ల పరిధిలో ఈ పనులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో రోడ్డు విస్తరణలో స్థలాలు, ఇళ్లు కోల్పోయిన వారికి ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్ (టీడీఆర్) ఇస్తామని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో స్పష్టమైన హామీ ఇచ్చారు. ఇందుకు అనుగుణంగా పనిని కూడా ప్రారంభించారు. దశాబ్దన్నర కాలంగా నిలిచిపోయిన ఈ పనులు కాస్తా గత ప్రభుత్వ హయాంలోనే తుది దశకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో స్థలాలు కోల్పోయిన వారికి టీడీఆర్‌ను ఇవ్వాల్సి ఉంది. అదే ఇప్పుడు అధికార పార్టీ నేతలు, కార్పొరేటర్లకు ఆదాయ వనరుగా మారిపోయింది.

టీడీఆర్‌లు ఇవ్వక్కర్లేదంటూ ప్రచారం?

వాస్తవానికి కోల్పోయిన స్థలమంతా దేవదాయ శాఖదని.. ఆ శాఖకు ఇప్పటికే ప్రత్యామ్నాయ స్థలాన్ని ఇచ్చిన నేపథ్యంలో టీడీఆర్‌లను ఇవ్వాల్సిన అవసరం లేదంటూ అధికార పార్టీ నేతలు, కార్పొరేటర్లు తెలివిగా ప్రచారం ప్రారంభించారు. అయినప్పటికీ తాము ఎంతో కష్టపడి టీడీఆర్‌లను సాధిస్తామని.. ఇందుకోసం కొంత మొత్తం ఇవ్వాలంటూ వసూళ్లకు తెగబడ్డారు. ఎవరైనా ఎందుకు ఇవ్వాలని ఎదురు ప్రశ్నిస్తే.. మీ టీడీఆర్ ఎలా జారీ అవుతుందో చూస్తామంటూ బెదిరింపులకు కూడా దిగుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రూ.1.76 కోట్ల వసూళ్లు టార్గెట్

రహదారి విస్తరణలో పాత గోశాల నుంచి అడవివరం మధ్య ఉన్న ఇళ్లు, స్థలాలు, వ్యాపారాలను అనేక మంది కోల్పోయారు. ఈ రెండు కిలోమీటర్ల పరిధిలో 181 ప్రాపర్టీలు ఉన్నట్లు లెక్కగట్టారు. వీరి నుంచి మొత్తంగా 11,033.892 చదరపు మీటర్ల స్థలాన్ని సేకరించారు. దీనికి గాను 1:4 నిష్పత్తిలో టీడీఆర్ బాండ్లు జారీ చేయాల్సి ఉంది. అంటే మొత్తంగా 44,135.568 చదరపు మీటర్ల వరకు టీడీఆర్‌లు ఇవ్వాల్సి ఉంది. ఈ టీడీఆర్‌లు దక్కాలంటే తప్పనిసరిగా తమకు చదరపు మీటర్‌కు రూ.400 ఇవ్వాలని ఒక కార్పొరేటర్ డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. లేనిపక్షంలో టీడీఆర్‌లు వచ్చే అవకాశం లేదని హెచ్చరిస్తున్నట్లు సమాచారం. ఈ రెండు కిలోమీటర్ల టీడీఆర్‌ల ద్వారా రూ.1.76 కోట్లు వసూలు చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నట్లు టాక్ వినిపిస్తోంది.

మంత్రి నారాయణ, ఎమ్మెల్యే గంటాల పేరుతో..

సదరు కార్పొరేటరు మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు దగ్గరగా ఉంటారనే పేరుంది. గంటా వద్ద ఏ పని కావాలన్నా చేసిపెడతానంటూ కాంట్రాక్టర్లకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, బ్రోకర్లకు తరచూ చెబుతుంటారనే తెలుస్తోంది. ఈ సింహాచలం టీడీఆర్‌ల ఎపిసోడ్‌లో గంటాతో పాటు ఆయన వియ్యంకుడు మంత్రి నారాయణ పేరును కూడా వాడుకుంటున్నట్లు విమర్శలున్నాయి. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు కూడా వినతిపత్రాలు ఇవ్వాల్సి ఉందని.. పలువురి వద్ద ప్రస్తావించినట్లు తెలిసింది. ఈ టీడీఆర్‌ల వసూళ్ల వ్యవహారం రచ్చ రేపుతున్నా.. కూటమి ఎమ్మెల్యేలు, ఎంపీ నోరుమెదపక పోవడం వెనుక అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.





అద్భుతమైన క్యాచ్ అందుకున్న జేక్ ఫ్రేజర్

ఢిల్లీ షో

- సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై ఘన విజయం
- విశాఖ వేదికగా రెండో మ్యాచ్‌లోనూ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు



నిరాశతో వెనుదిరుగుతున్న నితీశ్



మిథాలీరాజ్

విశాఖ స్పోర్ట్స్: డాక్టర్ వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ స్టేడియం ఆదివారం క్రికెట్ అభిమానుల కేరింతలతో మార్మోగింది. తమ రెండో హోం గ్రౌండ్‌గా వైఎస్సార్ స్టేడియంను ఎంచుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ ఆడిన రెండో మ్యాచ్‌లోనూ అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో ఢిల్లీ బౌలర్లు, బ్యాటర్లు సమష్టిగా రాణించి 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించారు. అభిషేక్ పోరెల్ సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించడంతో స్టేడియం సంబరాలతో నిండిపోయింది. మిచెల్ స్టార్క్ తన బౌలింగ్‌తో హైదరాబాద్ బ్యాటర్లను వణికించాడు. ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, స్థానిక ఆటగాడు నితీష్ కుమార్ త్వరగా అవుట్ కావడంతో విశాఖ అభిమానులు నిరాశ చెందారు. కాగా.. ఈ మ్యాచ్‌ను వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు తరలివచ్చారు. స్టేడియంలోని స్టాండ్లన్నీ నిండిపోయాయి. సొంత జట్టు ఢిల్లీ క్యాపిటల్స్‌తో పాటు తెలుగు జట్టు సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను కూడా ప్రోత్సహించారు. ఈ సీజన్‌లో విశాఖ వేదికగా జరిగిన రెండు మ్యాచ్‌లు ఢిల్లీ క్యాపిటల్స్‌కు మరచిపోలేని అనుభూతిని మిగిల్చాయి. క్రికెట్ అభిమానుల ఆదరణ, స్టేడియంలో నెలకొన్న సందడి ఐపీఎల్‌కు ఉన్న క్రేజ్‌ను మరోసారి నిరూపించాయి. ఐసీసీ చైర్మన్ జైషా, బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్, భారత మహిళా క్రికెట్ దిగ్గజం మిథాలీ రాజ్, ఏసీఏ అధ్యక్ష కార్యదర్శులు కేశినేని చిన్ని, సతీష్‌బాబు తదితరులు ఈ మ్యాచ్‌ను వీక్షించారు.



కెప్టెన్ అక్షర్, స్టార్క్ విజయదరహాసం



మ్యాచ్‌ను తిలకిస్తున్న జై షా, రామ్మోహన్‌నాయుడు, లోకేష్











యువత.. కేరింత..





జీవీఎంసీకి రూ.7.51 కోట్లు చెల్లించిన ఏయూ



బకాయిపడ్డ ఆస్తిపన్ను చెల్లిస్తున్న ఏయూ

డాబాగార్డెన్స్: ఆస్తిపన్ను చెల్లింపుల్లో జీవీఎంసీ రికార్డు సాధించింది. ఎప్పటి నుంచో బకాయిపడ్డ రూ.7.51 కోట్లను ఆంధ్ర విశ్వ కళాపరిషత్ నుంచి జీవీఎంసీ వసూలు చేసింది. ఆస్తిపన్ను బకాయిల వడ్డీపై మార్చి నెలాఖరు వరకు 50 శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ ఆర్ సోమన్నారాయణ, డిప్యూటీ కమిషనర్(రెవెన్యూ) సత్తారు శ్రీనివాసరావు, జోనల్ కమిషనర్ శివప్రసాద్, రెవెన్యూ ఆఫీసర్ పైడిరాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేష్ ఏయూపై తీవ్ర ఒత్తిడి చేసి, బకాయి పడ్డ ఆస్తిపన్నును వసూలు చేయడంలో సఫలీకృతులయ్యారు.

నేత్రపర్వం అప్పన్న పెళ్లిరాట ఉత్సవం

- శాస్త్రోక్తంగా పంచాంగశ్రవణం
- వచ్చేనెల 8న వార్షిక కల్యాణోత్సవం
- ఆస్థానమండపం వరకు వచ్చిన సూర్యకిరణాలు

సింహాచలం : ఉగాది పర్వదిన వేళ సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి పెళ్లిరాట మహోత్సవాన్ని ఆదివారం కనులపండువగా నిర్వహించారు. వచ్చే నెల 8న స్వామి వారి వార్షిక కల్యాణోత్సవాన్ని పురస్కరించుకొని భక్తజన సందోహం మధ్య మధ్యాహ్నం 3.30 గంటల నుంచి పెళ్లి రాట కార్యక్రమాన్ని ఘనంగా జరిపారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని పెళ్లికుమారుడుగా అలంకరించి శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో సహా ఆలయ ఆస్థాన మండపంలో వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, షోడశోపచార పూజలు నిర్వహించారు. తొలుత దేవస్థానం పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు పంచాగ పఠనం చేశారు. అనంతరం వార్షిక కల్యాణోత్సవం జరిగే ఉత్తరరాజగోపురం ఎదుట ప్రాంగణంలోను పెళ్లిరాటను శాస్త్రోక్తంగా వేశారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, దేవస్థానం పంచాంగ రచయిత తెన్నేటి శ్రీనివాసశర్మ, అర్చకులు, వేదపండితులు, పారాయణదారులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు. దేవస్థానం ఈవో కె.సుబ్బారావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్న పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు

అప్పన్న ఆదాయం–5, వ్యయం–2

శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామివారి ఆదాయం 5, వ్యయం 2గా పంచాంగం ప్రకారం ఆలయ పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు పేర్కొన్నారు. స్వాతి నక్షత్రం, తులారాశి వాడైన శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి వారికి విశ్వావసు నామ సంవత్సరంలో వ్యయం కంటే ఆదాయమే అధికమని పేర్కొన్నారు.



పెళ్లిరాట వేస్తున్న వేద పండితులు

ఆస్థానమండపం వరకు సూర్యకిరణాలు

స్వామి మూలవిరాట్‌పై పడే సూర్యకిరణాలను చూసేందుకు వచ్చిన భక్తులకు ఈసారి నిరాశే ఎదురైంది. ఈఏడాది ఆస్థానమండపం వరకు సూర్యకిరణాలు వచ్చాయి. కానీ అప్పటికే ఉన్న భక్తులను నియంత్రించడంలో సిబ్బంది విఫలమవడం, వెంటనే మబ్బులు వచ్చేయడంతో మూలవిరాట్‌పై సూర్యకిరణాలను చూసే భాగ్యానికి భక్తులు నోచుకోలేదు.

ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను రాయితీకి నేడే ఆఖరు

- రాత్రి 12 గంటల వరకు సౌకర్యం కేంద్రాలు పని చేస్తాయి
- జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ హరేంధిర ప్రసాద్

డాబాగార్డెన్స్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జీవీఎంసీ పరిధిలో ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుపై వడ్డీ రాయితీ గడువు సోమవారంతో ముగియనుంది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్ను బకాయిలను ఈ నెల 31లోగా ఒకే సారి చెల్లిస్తే 50 శాతం వడ్డీ రాయితీ లభిస్తుందని జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎస్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. పన్ను చెల్లింపుదారులు ఆన్‌లైన్ (gvmc. gov. in-property tax-bharat qr code), జీవీఎంసీ సౌకర్యం కేంద్రాలు, బ్యాంకులు (ఐడీబీఐ సిరిపురం, ఐసీఐసీఐ ద్వారకానగర్, పంజాబ్ నేషనల్ మధురవాడ, యాక్సిస్ రాంనగర్), వార్డు సచివాలయాల్లో చెల్లించవచ్చు. ఆస్తి పన్ను చెల్లింపుదారుల సౌకర్యార్థం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం, జోనల్ కార్యాలయాల్లోని కౌంటర్లు సోమవారం ఉదయం 7 నుంచి రాత్రి 12 వరకు పనిచేస్తాయి. ఈ అవకాశాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని కమిషనర్ కోరారు.

పన్నుల ద్వారా ఆదాయమిలా..

నెల	2023-24 (రూ.కోట్లలో)	2024-25 (రూ.కోట్లలో)
ఏప్రిల్	119.31	132.11
మే	23.21	18.84
జూన్	37.29	25.66
జూలై	16.31	19.30
ఆగస్టు	13.61	16.90
సెప్టెంబర్	20.41	18.96
అక్టోబర్	13.62	15.08
నవంబర్	47.96	28.21
డిసెంబర్	36.75	38.94
జనవరి	10.34	18.02
ఫిబ్రవరి	13.40	32.24
మార్చి	104.45	114.38

(30 సాయంత్రం 6 గంటల వరకు)

2023–24 ఏడాదికి రూ.445 కోట్లు వసూలు కాగా, 2024–25 ఏడాది మార్చి 30 సాయంత్రం 6 గంటల వరకు రూ.478.62 కోట్లు వసూలయ్యాయి.

శుభాలు నిండుగా..
ఆలయాలకు ఉగాది శోభ



శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ



కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో క్యూలో వేచి ఉన్న భక్తులు





ఆశీలమెట్ట శ్రీ సంపత్ వినాయగర్ దేవాలయంలో ఉగాది సందర్భంగా భక్తుల రద్దీ

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉగాది వేడుకలు ఆదివారం అంబరాన్నంటాయి. తెల్లవారుజాము నుంచి జిల్లాలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దేవతామూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయాలను మామిడి తోరణాలు, పూలతో విశేషంగా అలంకరించారు. పండగ సందర్భంగా ప్రజలు నూతన వస్త్రాలు ధరించి ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పకున్నారు. ఆశీలమెట్టలోని సంపత్ వినాయగర్ ఆలయ ప్రాంగణంలో కొత్త వాహనాలకు పూజలు నిర్వహించారు. బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం, రమా సత్యనారాయణస్వామి ఆలయం, అంబికాబాగ్ సీతారామ ఆలయం, తదితర ఆలయాలు భక్తులతో నిండిపోయాయి. ఆయా చోట్ల నిర్వాహకులు ప్రసాద వితరణ చేశారు. బంగారు, ఎలక్ట్రానిక్ దుకాణాలు సందడిగా కనిపించాయి.

పంచాంగ పఠనం.. కవి సమ్మేళనం

- వైభవంగా ఉగాది వేడుకలు
- పంచెకట్టుతో హాజరైన జిల్లా అధికారులు
- పీ–4 విధానం ద్వారా పేదరిక నిర్మూలన: కలెక్టర్

బీచ్‌రోడ్డు: వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ఆదివారం ఉగాది వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. శాస్త్రోక్తంగా పూజలు, వేదపారాయణలు, మంత్రోచ్చరణలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఈ వేడుకల్లో జిల్లా ఉన్నతాధికారులు పంచెకట్టుతో హాజరై తెలుగు సంప్రదాయానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చారు. పంచాంగ పఠనం కోసం ఏర్పాటు చేసిన వేదిక వద్ద ఉత్సవ విగ్రహాలు, వివిధ ఆలయాల ప్రధాన అర్చకులు కొలువుదీరారు. కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, ఇతర ప్రముఖులు సంప్రదాయ వస్త్రధారణలో ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అర్చకులు, వేదపండితులు పూర్ణకుంభంతో అతిథులకు స్వాగతం పలికారు. అనంతరం పంచాంగ కర్తలు పంచాంగ పఠనం చేయగా, అతిథులందరూ ఆసక్తిగా ఆలకించారు.

గడ్డు పరిస్థితులు తప్పవు

ఈ సందర్భంగా పంచాంగకర్తలు పానిహారం నరసింహమూర్తి, పానంగపల్లి రంగనాథాచార్యులు, జి. శేషాచార్యులు విశ్వావసు నామ సంవత్సర ఉగాది ఫలితాలను వివరించారు. ఈ ఏడాది జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారని, సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని, పంటలు బాగా పండుతాయని తెలిపారు. అయితే మధ్య తరగతి ప్రజలకు ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని, నిత్యావసరాల ధరలు పెరుగుతాయని, స్వల్పంగా రోగాలు ఉన్నప్పటికీ కొన్ని సమయాల్లో పరిస్థితులు కష్టంగా ఉండవచ్చని హెచ్చరించారు. ఎండలు తీవ్రంగా ఉంటాయని, అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీ–4 అనే నూతన విధానం ద్వారా పేదరికం లేని సమాజ స్థాపన సాధ్యమవుతుందన్నారు. ప్రజలంతా సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని, లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు.



పచ్చడి తింటున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జేసీ అశోక్

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

వేడుకల్లో భాగంగా కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థుల నృత్యాలు, తెలుగు భాష గొప్పతనాన్ని, ఉగాది విశిష్టతను తెలిపే కవి సమ్మేళనాలు ఆహూతులను ఎంతగానో అలరించాయి. ఈ సందర్భంగా వేదపండితులు, పంచాంగకర్తలను అతిథులు ఘనంగా సత్కరించి, నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్, జిల్లా టూరిజం శాఖ ఆర్డీ జగదీశ్, పర్యాటక శాఖ అధికారి సుధాసాగర్, జూ క్యూరేటర్ మంగమ్మ, భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, డిప్యూటీ కలెక్టర్ సత్తిబాబు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



పంచాంగ పఠనం చేస్తున్న పానిహారం నరసింహమూర్తి, పానంగపల్లి రంగనాథాచార్యులు, శేషాచార్యులు



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

రంజాన్‌కు ఏర్పాట్లు పూర్తి


మహ్మదీయ మసీదు


యాసీన్ మసీదు

- నేడు ఈద్–ఉల్– ఫితర్
- ముస్తాబైన మసీదులు, ఈద్గాలు

జగదాంబ : రంజాన్ పండగను (ఈద్–ఉల్–ఫితర్) సోమవారం ఘనంగా జరుపుకోవాలని మౌల్వీలు ప్రకటించారు. నగరంలోని మసీదులు, ఈద్గాలు విద్యుత్ దీపాలతో అలంకరించారు. చెంగల్రావుపేట వద్ద ఉన్న జామీయా మసీదు, జగదాంబ దరి మక్కా మసీదు, చినవాల్తేరులో మహమ్మదీయ మసీదు, బుల్లయ్య కాలేజీ వద్ద ఉన్న యాసీన్ మసీదుతో పాటు అన్ని ప్రాంతాల్లో మసీదులు, ఈద్గాల్లో ఈద్ నమాజ్‌కు ఏర్పాట్లు చేశారు. నూతన దుస్తులు, టోపీలు, సెంట్లు, సూర్మాతో పాటు సేమియా, జీడిపప్పు, కిస్మిస్ కొనుగోళ్లతో మార్కెట్‌లో సందడి నెలకొంది.

పదోన్నతుల ‘పంచాయితీ’!

- ఉద్యోగుల పదోన్నతుల్లో తాత్సారం చేస్తున్న డీపీవో
- ఈ నెల 21కే వెళ్లాల్సిన ఫైల్.. ఇంకా డీపీవో ఆఫీస్‌లోనే..
- చక్రం తిప్పుతున్న సిబ్బంది.. ఆందోళనలో ఉద్యోగులు


జిల్లా పంచాయతీ కార్యాలయం

మహారాణిపేట: జిల్లా పంచాయతీ ఉద్యోగుల పదోన్నతుల పంచాయితీ ఆరోపణలకు తావిస్తోంది. ముడుపులు చెల్లిస్తే తప్ప.. ఫైల్ ముందుకు కదలదని ఉద్యోగులు గుసగుసలుపోతున్నారు. దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న పదోన్నతులకు ఎట్టకేలకు అవకాశం వచ్చినప్పటికీ.. సిబ్బంది మామూళ్ల వ్యవహారంతో ఫైల్ ఇంకా జిల్లా పంచాయతీ కార్యాలయం(డీపీవో)లోనే మూలుగుతోంది. ఈ పదోన్నతులను ఆదాయ వనరుగా మార్చుకోవాలనే కొందరి అత్యాశే ఈ ఫైల్ తొక్కిపెట్టేందుకు కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎంపీడీవోలు ఫైళ్లు పంపించినా..

పంచాయతీరాజ్‌లో పదోన్నతులు కల్పించే విషయంలో సీనియార్టీ జాబితాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారులు(ఎంపీడీవో) తయారు చేసి డీపీవోకు పంపాలి. ఈ ప్రకారం జిల్లాలో 32 మందిని అర్హులుగా పేర్కొంటూ జాబితాను డీపీవో కార్యాలయానికి ఎంపీడీవోలు పంపారు. కానీ ఇక్కడ డీపీవో కార్యాలయం నుంచి ఈ జాబితా పంపేందుకు కొందరు బేరసారాలకు దిగుతున్నారన్న ఆరోపణలున్నాయి. పైసలు ఇస్తేనే ఫైల్ పంపుతామని, లేకపోతే పదోన్నతులుండవని తేల్చిచెప్తున్నారట. అందుకే ఈ ఫైల్ ఇంకా విశాఖను దాటలేదని సమాచారం.

ఆ ఒక్కడే కారణం?

ఆరోపణలపై పాడేరు నుంచి విశాఖ డీపీవో కార్యాలయానికి వచ్చిన ఓ ఉద్యోగి వల్లే పదోన్నతుల్లో తాత్సారం జరుగుతోందని సమాచారం. ఈ ఉద్యోగికి డీపీవో కార్యాలయంలో కీలక బాధ్యతలు అప్పగించారు. ఫైల్ కూడా అతని వద్దే ఉంది. డబ్బులిస్తే తప్ప, ఫైల్‌ను పంపించేది లేదని చెప్తున్నాడట. అధికారుల అండతోనే ఇలా చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. దీంతో 32 మంది ఉద్యోగులు లబోదిబోమంటున్నారు. దీనిపై డీపీవో శ్రీనివాసరావును వివరణ కోరగా.. పూర్తి స్థాయి వివరాలు రాకపోవడంతో జాబితా సిద్ధం కాలేదన్నారు. కొంత మంది ఎంపీడీవోలు ఈ నెల 26న జాబితాలను పంపారని, మరి కొందరు పంపించాల్సి ఉందన్నారు. అన్ని వివరాలతో ఫైల్ తయారు చేసి, త్వరలోనే పైకి పంపించనున్నట్లు పేర్కొన్నారు.

సందిగ్ధంలో 32 మంది పదోన్నతులు

రాష్ట్ర వ్యాప్తంగా పదోన్నతులకు ఈ నెల 21 నాటికే డీపీవో నుంచి ఫైల్ అమరావతిలో ఉన్న పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయానికి వెళ్లాలి. కానీ ఇప్పటి వరకు జాబితా వెళ్లకపోవడంతో ఉద్యోగులు లబోదిబోమంటున్నారు. మొత్తం 32 మందికి పంచాయతీ కార్యనిర్వహణాధికారి అండ్ రూరల్ డెవలప్‌మెంట్(ఈవోఆర్డీ)గా పదోన్నతులు అందించే ఫైల్.. విశాఖలోని డీపీవో కార్యాలయంలోనే ఇంకా ఉంది. ఇప్పటికే చాలా జిల్లాల నుంచి పదోన్నతుల ఫైళ్లు అమరావతికి చేరాయి. విశాఖలో మాత్రం ఫైల్‌కు ఇంకా తుది మెరుగులు దిద్దుతూనే ఉన్నారు..!

రంగస్థలంలో రగడ

- గోల్డ్‌మెడల్ కోసం గొడవ
- దిగజారుతున్న ఏయూ ప్రతిష్ట
- ఆచార్యుల తీరుపై గవర్నర్‌కు ఫిర్యాదు


థియేటర్ ఆర్ట్స్ విభాగంలో ప్రదర్శించిన బుర్రకథ(ఫైల్)


ఆంధ్ర యూనివర్సిటీ

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీ రంగస్థలం విభాగం రచ్చకెక్కుతోంది. ఆచార్యుల మధ్య నెలకొన్న విభేదాలతో ఏయూ ప్రతిష్ట దిగజారుతోంది. గోల్డ్‌మెడల్ ఎంపిక ప్రక్రియ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతోందని, ఓ విద్యార్థి గవర్నర్‌కు ఫిర్యాదు చేయడంతో ‘రంగస్థలం’ రసవత్తరంగా మారింది. ఈ పంచాయితీ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య రాజశేఖర్ దృష్టికి వెళ్లడంతో.. థియేటర్ ఆర్ట్స్ విభాగాధికారులు ఈ వ్యవహారాన్ని చక్కదిద్దేందుకు రంగంలోకి దిగారు. శతాబ్ది ఉత్సవాలకు సన్నద్ధమవుతున్న తరుణంలో రంగస్థలంలో ఇదేం రచ్చ అంటూ వర్సిటీలోని మిగతా విభాగాల్లో చర్చసాగుతోంది.

ఇదీ రంగస్థలం చరిత్ర

నాటకరంగం పుట్టినిల్లుగా ఖ్యాతిగడించిన ఉత్తరాంధ్రలో.. ఆ రంగానికి మరింత ఆదరణ తీసుకొచ్చేలా ఆంధ్ర యూనివర్సిటీలో ప్రత్యేకంగా ‘థియేటర్ ఆర్ట్స్’ విభాగాన్ని 1961లో ఏర్పాటు చేశారు. నటన, దర్శకత్వం కోర్సులను ఇక్కడ నిర్వహిస్తున్నారు. ఒక్కో కోర్సుల్లో 20 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. రాష్ట్రంలో మరే ఇతర యూనివర్సిటీల్లోనూ ఇలాంటి కోర్సులు అందుబాటులో లేకపోవడం, ఏయూకు ఉన్న ప్రతిష్ట దృష్ట్యా దేశం నలుమూలల నుంచి ఇక్కడ శిక్షణ పొందేందుకు విద్యార్థులు వస్తున్నారు. సాయంత్రం వేళలో నిర్వహించే కోర్సులు కావడంతో మంచి ఆదరణ లభిస్తోంది.

అసలేం జరిగిందంటే..

థియేటర్ ఆర్ట్స్ విభాగానికి సంబంధించిన ఫలితాలు ప్రకటించడంలో తీవ్ర జాప్యం జరిగింది. దీనిపై ‘ఆచార్య...ఫలితాలెప్పుడు..?’అనే శీర్షికన ఈ నెల 17న సాక్షిలో ప్రచురితమైన కథనంలో వర్సిటీ అధికారులు మేల్కొన్నారు. యుద్ధప్రాతిపదికన మూల్యాంకనం పూర్తి చేయించారు. ఇదే క్రమంలో అత్యధిక మార్కులు సాధించిన ఓ విద్యార్థికి గోల్డ్‌మెడల్ సిఫార్సు చేశారు. పరీక్షల ఫలితాలు ప్రకటించేందుకు సర్వం సిద్ధం చేశారు. అయితే మూల్యాంకనంలో లోపాలు జరిగాయని ఓ విద్యార్థి గవర్నర్‌కు ఫిర్యాదు చేసినట్లుగా తెలుస్తోంది.

మూల్యాంకనంలో పారదర్శకత ఎంత?

థియేటర్ ఆర్ట్స్ విభాగంలో రెగ్యులర్ ఆచార్యుల పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. దీంతో ఇక్కడ కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న ఇద్దరు ఆచార్యుల ఆధ్వర్యంలోనే గోల్డ్ మెడల్ ఎవరికి ఇవ్వాలనేది నిర్ణయిస్తారు. జవాబు పత్రాల మూల్యాంకనం కూడా వీరే చేస్తారు. ఇదే అనేక అనుమానాలకు తావిస్తోంది. విద్యార్థులను పాస్ చేయాలా? ఫెయిల్ చేయాలా అనేది ఆచార్యుల చేతుల్లోనే ఉండటంతో మూల్యాంకనం ప్రక్రియలో పారదర్శకత లోపిస్తోంది. మరో యూనివర్సిటీలోని సబ్జెక్టు నిపుణులతో సెకండ్ ఓపీనియన్ తీసుకుంటే.. వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పలువురు అంటున్నారు.

‘గోల్డ్‌మెడల్’తో గొడవ

రంగస్థల విభాగంలో అత్యధిక మార్కులతో ప్రతిభ సాధించిన ఓ విద్యార్థికి ఏటా గోల్డ్‌మెడల్‌కు ఎంపిక చేస్తారు. దీనిని స్నాతకోత్సవంలో బహూకరిస్తారు. ఇది ఎవరికి ఇవ్వాలనేది ఈ విభాగం ఆచార్యులకే సర్వాధికారాలు ఉంటాయి. అయితే గోల్డ్‌మెడల్ ఎంపిక ప్రక్రియలో ఇక్కడి ఆచార్యుల మధ్య పొసగకపోవడంతో రంగస్థలం రచ్చకెక్కుతోందనే ప్రచారం ఉంది. బంగారు పతకం మీకే ఇస్తామంటూ విద్యార్థులతో ఇక్కడి ఆచార్యులు బేరసారాలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఒక అధ్యాపకుడు అవినీతి నిరోధకశాఖకు పట్టుబడిన చరిత్ర కూడా ఈ విభాగానికి ఉంది.

ఫలితాల లీకులతో ఆందోళన

థియేటర్ ఆర్ట్స్ విభాగం ఫలితాలు ఇంకా అధికారికంగా ప్రకటించకముందే.. వీటిని కొంత మంది విద్యార్థులకు లీకులు ఇచ్చినట్లుగా ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలోనే మూల్యాంకనంపై గవర్నర్‌కు ఫిర్యాదు వెళ్లినట్లు తెలుస్తోంది. మూల్యాంకనంలో వాస్తవికతను ధ్రువీకరించే క్రమంలో నటన, దర్శకత్వంలో నిపుణులైన వేరే యూనివర్సిటీ ఆచార్యులతో పరిశీలన చేయించాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది.

మందలించినందుకే తండ్రిని హత్య చేశాడు

అరిలోవ : చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని మందలించాడని కోపంతోనే కుమారుడు తండ్రిపై బ్లేడుతో దాడి చేసి హత్య చేశాడని పోలీసులు తెలిపారు. నిందితుడిని ఆదివారం రిమాండ్‌కు తరలించారు. ఆరిలోవ సీఐ సీహెచ్.మల్లేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. జీవీఎంసీ 11వ వార్డు పరిధి డ్రైవర్స్ కాలనీలో రిటైర్డ్ రైల్వే ఉద్యోగైన పి.అప్పారావు(84) భార్య, కుమారుడితో నివాసముంటున్నాడు. అతని కుమారుడు బాలయోగి(42) చెడు అలవాట్లకు బానిసయ్యాడు. ఏ పని చేయకుండా ఖాళీగా ఉండటంతో వివాహం కూడా చేయలేదు. దీంతో తండ్రి తరచూ కుమారుడిని మందలించేవాడు. అయినా బాలయోగిలో మార్పురాకపోవడంతో తరచూ ఇంట్లో గొడవలు జరుగుతుండేవి. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి తండ్రీ కొడుకుల మధ్య గొడవ జరిగింది. తండ్రి కోపంతో కుమారుడిపై చేయిచేసుకున్నాడు. దీంతో ఆగ్రహించిన బాలయోగి బ్లేడుతో తండ్రిపై దాడిచేసి చాతీ భాగంలో లోతుగా కోశాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో అప్పారావు కుప్పకూలిపోయాడు. స్థానికులు రక్తపు మడుగులో ఉన్న అప్పారావును కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు బాలయోగిని అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం రిమాండ్‌కు తరలించారు.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితులు

మద్రిపాలెం: ఇటీవల అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన వృద్ధుడు హనుమంతరావు కేసులో ఇద్దరిని కంచరపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. బర్మా క్యాంప్ ఏఎస్ఆర్ నగర్‌కు చెందిన వృద్ధుడు మద్యం మత్తులో స్థానికంగా ఉన్న ఓ వృద్ధురాలి ఇంట్లోకి ఈ నెల 28న చొరబడి.. ఆమెపై అఘాయిత్యానికి పాల్పడినట్లు సమాచారం. అతని ఒంటిపై దుస్తులు లేకపోవడంతో ఆమెతో తప్పుగా ప్రవర్తించినట్లు స్థానికులు గుర్తించి కరెంట్ స్తంభానికి అతని కాళ్లు, చేతులు కట్టేసి దేహశుద్ధి చేశారు. దీంతో వృద్ధుడు మృతి చెందినట్టు తెలిసింది. ఈ కేసులో వెంకటరమణ, శివలను అరెస్ట్ చేసి జైలుకు పంపించినట్టు పోలీసులు తెలిపారు. కాగా.. వృద్ధుడు మృతికి కారణమైన అదే ప్రాంతానికి చెందిన ఇద్దరు మహిళలను పోలీసులు అరెస్ట్ చేయాలని వెంకటరమణ కుటుంబసభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఈ కేసులో పూర్తి స్థాయి విచారణ కొనసాగుతోందని కంచరపాలెం పోలీసులు తెలిపారు.

నకిలీ బంగారం కేసులో ఇద్దరి అరెస్ట్

సీతమ్మధార : నకిలీ బంగారం కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ద్వారకా ఏసీపీ అన్నపు నరసింహమూర్తి తెలిపారు. ఆదివారం ద్వారకా పోలీస్ స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. ఈశ్వరరావు, రాఘవేంద్ర సుబ్బారావు గాజువాకకు చెందిన జగదీశ్వరావుతో పరిచయం పెంచుకున్నారు. వారు తమ చెల్లి పేరు మీద 2.9 కిలోల బంగారం బ్యాంకులో ఉందని, దానిని విడిపించాలని జగదీశ్వరావును కోరారు. ఇది నిజమేనని నమ్మిన జగదీశ్వరావు వారికి రూ.68 లక్షలు ఇచ్చి బంగారాన్ని విడిపించాడు. తీరా పరిశీలించగా అందులో కేవలం 200 గ్రాముల అసలైన బంగారం మాత్రమే ఉండటంతో మోసపోయానని గ్రహించిన జగదీశ్వరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా ఈ మోసంలో ఎనిమిది మందికి ప్రమేయం ఉన్నట్లు గుర్తించామని ఏసీపీ తెలిపారు. వీరిలో ఈశ్వరరావు, రాఘవేంద్ర సుబ్బారావులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 1700 గ్రాముల నకిలీ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ నకిలీ బంగారాన్ని తనఖా పెట్టిన బ్యాంకు ఉద్యోగుల పాత్రపై కూడా ఆరా తీస్తున్నారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు. ఎస్ఐలు ధర్మేంద్ర, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు పీజీఆర్ఎస్ రద్దు

మహారాణిపేట: రంజాన్ పర్వదినం సందర్భంగా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిరప్రసాద్ తెలిపారు.

- నగర పోలీసు కాన్ఫరెన్స్ హాలులో సోమవారం నిర్వహించాల్సిన పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పోలీసు కమిషనర్ బాగ్చి తెలిపారు.

స్వర సిల్వర్ జ్యూయలరీ షోరూమ్ ప్రారంభం


ఆభరణాలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

సీతమ్మధార : ఆశీలమెట్ట జంక్షన్ సంపత్ వినాయగర్ ఆలయ రోడ్‌లో స్వర సిల్వర్ జ్యూయలరీ షోరూమ్‌ను ఆదివారం ప్రారంభించారు. ప్రారంభోత్సవ సందర్భంగా 925 సిల్వర్ జ్యూయలరీపై అదనంగా 50 శాతం జ్యూయలరీని అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే తమ వద్ద మారుతున్న ఫ్యాషన్ ప్రపంచాన్ని దృష్టిలో పెట్టుకొని ఐ ఫినిష్, గోల్డ్ పాలిష్ 925 సిల్వర్ జ్యూయలర్స్ వివిధ మోడళ్లలో అందిస్తునట్లు పేర్కొన్నారు. అదే విధంగా పెళ్లిళ్లు, వివిధ శుభకార్యాలకు అనువైన మోడల్స్ పలు సంఖ్యలో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అదే విధంగా రూ.5 వేలు నుంచి రూ.5 లక్షల వరకు వివిధ రకాల ఆర్నమెంట్స్ మగువలు మెచ్చే విధంగా వివిధ డిజైన్లతో లభిస్తున్నట్లు పేర్కొన్నారు.

కనకమహాలక్ష్మి సన్నిధిలో పంచాంగ పఠనం


పంచాంగ పఠనం చేస్తున్న తెన్నేటి శ్రీనివాస శర్మ

దాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువైన శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఉగాది పురస్కరించుకుని ఆదివారం అమ్మవారిని స్వర్ణాభరణాలతో అలంకరించారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అమ్మవారు స్వర్ణాభరణాలు, పట్టుచీరలో దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. గణపతి పూజ, మండపారాధన, పంచాంగ కర్త బ్రహ్మశ్రీ తెన్నేటి శ్రీనివాస శర్మ పంచాంగ పఠనం అనంతరం భక్తులకు ఉగాది పచ్చడి, పంచాంగ పుస్తకాలు వితరణ చేశారు. ఆలయ ఏఈవో కె.ఎస్. తిరుమల్లేశ్వరరావు, పర్యవేక్షణాధికారి తిరుపతిరావు పాల్గొన్నారు.

త్వరలో స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్లు

మహారాణిపేట: జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో త్వరలో స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ అమల్లోకి రానున్నట్లు రిజిస్ట్రేషన్ల శాఖవిశాఖ జిల్లా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్(డీఐజీ) బాలకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రక్రియ వల్ల కాలయాపన తగ్గుతుందన్నారు. స్లాట్ బుకింగ్ విధానంలో డిజిటల్ క్యూ మేనేజ్‌మెంట్ సిస్టమ్(డీక్యూఎంఎస్) ద్వారా రిజిస్ట్రేషన్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

బీఎస్ రెడ్డికి కళారత్న అవార్డు


డాక్టర్ బీఎస్ రెడ్డికి ‘కళారత్న’అవార్డు బహూకరిస్తున్న సీఎం చంద్రబాబు


సీతమ్మధార: నగరానికి చెందిన ప్రఖ్యాత మహేంద్రజాలికుడు డాక్టర్ బి.ఎస్.రెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం ‘కళారత్న’ అవార్డును ప్రదానం చేసింది. విజయవాడలో ఆదివారం జరిగిన ఉగాది వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. 35 ఏళ్లుగా ఇంద్రజాల రంగంలో విశేష ప్రతిభ కనబరిచినందుకు గానూ ఆయన్ని సత్కరించారు. తన కళా ప్రయాణంలో సహకరించిన అందరికీ బి.ఎస్.రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

అప్పన్న అన్నప్రసాదానికి రూ.5 లక్షల విరాళం


దేవస్థానం ఈవో సుబ్బారావుకు చెక్కు అందిస్తున్న దాత మురళి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి అన్న ప్రసాద పథకానికి బెంగళూరుకు చెందిన ఐకానిక్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఎండీ కె.మురళి రూ.5 లక్షల విరాళాన్ని ఆదివారం అందించారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో కలిసి వచ్చిన ఆయన సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో దేవస్థానం ఈవో కె.సుబ్బారావుకు ఇచ్చారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదంను అధికారులు అందించారు. ఈ తరుణంలోనే ఆలయ ఉత్తర రాజగోపురం ఎదురుగా ఉన్న వార్షిక కల్యాణ ప్రాంగణాన్ని విస్తరించేందుకు అయ్యే నిధులను కూడా ఇవ్వనున్నట్లు మురళి ప్రకటించారు.

అర కిలో ముత్యాల తలంబ్రాల బహూకరణ



వచ్చే నెల 8న సింహగిరిపై జరిగే శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని గాజువాకకు చెందిన గుంటపల్లి ప్రసాద్ 500 గ్రాముల మంచి ముత్యాల తలంబ్రాలను బహూకరించారు. సంబంధిత ముత్యాలను సింహగిరిపై ఆలయ అధికారుల సమక్షంలో అర్చకులకు ఆదివారం అందించారు.

రాంగ్ కాల్‌తో మొదలైన వేధింపులు

- మహిళ నుంచి రూ.4 కోట్ల దోపిడీ
- నిందితుడి అరెస్ట్

బీచ్‌రోడ్డు : నగరానికి చెందిన 35 ఏళ్ల మహిళ నాలుగేళ్లుగా అనుభవిస్తున్న నరకానికి తెరపడింది. శ్రీకాళహస్తికి చెందిన బి.అక్షయ్ కుమార్ అనే వ్యక్తి ఆమెను రాంగ్ కాల్ ద్వారా పరిచయం చేసుకుని, ఆపై బెదిరింపులు, లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. చివరికి బాధితురాలు ధైర్యం చేసి పోలీసులను ఆశ్రయించడంతో నిందితుడు అరెస్ట్ అయ్యాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలివి.. 2020లో కోవిడ్ విజృంభిస్తున్న సమయంలో అక్షయ్ కుమార్ పొరపాటున బాధితురాలికి ఫోన్ చేశాడు. మొదట్లో ఆమె స్పందించకపోయినా, అతను మెసేజ్‌లు పంపుతూ ఆమె వ్యక్తిగత వివరాలు తెలుసుకున్నాడు. బలవంతంగా స్నేహం కొనసాగిస్తూ.. మాట్లాడమని ఒత్తిడి చేశాడు. ఆమె నిరాకరించడంతో తన వద్ద ఉన్న వాయిస్ రికార్డింగ్‌లను ఆమె భర్తకు పంపిస్తానని బెదిరించాడు. అంతే కాదు ఏకంగా రూ.10 లక్షలను సీఎంఆర్ సెంట్రల్ షాపింగ్ మాల్‌లో ఆమె నుంచి తీసుకున్నాడు. అక్కడితో ఆగకుండా ఆమెను కారులో నగరంలోని హోటల్‌కు తీసుకెళ్లి లైంగిక దాడి చేశాడు. ఆ దృశ్యాలను వీడియో తీసి, వాటితో ఆమెను నిత్యం బెదిరించడం మొదలుపెట్టాడు. అలా దాదాపు రూ.4 కోట్ల నగదు, 800 గ్రాముల బంగారు ఆభరణాలు కాజేశాడు. ఆమె భర్తకు, కుటుంబ సభ్యులకు వీడియోలు పంపుతానని బెదిరించడంతో పాటు, ఆమె భర్తపై యాసిడ్ దాడి చేస్తానని, పిల్లలను కిడ్నాప్ చేస్తానని కూడా బెదిరించాడు. గత వారం నిందితుడు నోవాటెల్‌కు రమ్మని డిమాండ్ చేయగా, బాధితురాలు నిరాకరించింది. దీంతో మళ్లీ బెదిరింపులకు దిగాడు. ఈ వేధింపులు తట్టుకోలేక ఆమె ఆత్మహత్య చేసుకోవాలనుకునే స్థితికి చేరుకుంది. చివరకు ఆమె తన భర్త, కుటుంబ సభ్యుల సహాయంతో త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు వెంటనే రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని శనివారం అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి ఒక కారు, మొబైల్ ఫోన్, 65 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని ఆదివారం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

స్టేడియంలో పైలాన్ ఆవిష్కరణ


పైలాన్ ఆవిష్కరిస్తున్న ఐసీసీ చైర్మన్ జై షా

విశాఖ స్పోర్ట్స్: వైఎస్సార్ స్టేడియం ఆధునికీకరణకు గుర్తుగా పైలాన్‌ను ఐసీసీ చైర్మన్ జై షా ఆదివారం ఆవిష్కరించారు. రాష్ట్ర మంత్రి నారా లోకేష్, బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, ఏసీఏ అధ్యక్షుడు కేశినేని చిన్ని, ఎంపీ శ్రీ భరత్, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, మాజీ క్రికెటర్ చాముండేశ్వరినాథ్, మహిళా క్రికెట్ మాజీ కెప్టెన్ మిథాలీరాజ్, ఏసీఏ కార్యదర్శి సానా సతీష్ పాల్గొన్నారు.

ఫుడ్ కోర్టులో ఐసీసీ చైర్మన్ సందడి

మధురవాడ: ఐపీఎల్ మ్యాచ్ అనంతరం ఐసీసీ చైర్మన్ జై షా, బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, మంత్రి లోకేష్ పీఎంపాలెంలోని ఓ హోటల్‌లో సందడి చేశారు. ఐసీసీ చైర్మన్ విశాఖలో స్ట్రీట్ ఫుడ్ తీసుకోవాలని లోకేష్‌కు చెప్పినట్లు సమాచారం. దీంతో అధికారులు బీచ్‌రోడ్డు, ఇతర ప్రాంతాల్లోని ఫుడ్ కోర్టుల గురించి మంత్రికి వివరించారు. అయితే, దగ్గరలోనే చేద్దామని అనడంతో అక్కడ స్వగ్రామ ఫుడ్ అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. దీంతో వారు అక్కడ అర గంటకు పైగా గడిపి చాట్, పావ్ బాజీ రుచి చూశారు. టీ తాగి ఉద్యోగులతో ఫొటోలు దిగారు.

ఐపీఎల్ మ్యాచ్ చూసిన అనాథలు

- సీపీకి కృతజ్ఞతలు


అనాథ పిల్లలతో కలిసి విక్టరీ సింబల్ చూపిస్తున్న సీపీ బాగ్చి

అల్లిపురం: వైఎస్సార్ స్టేడియంలో ఆదివారం జరిగిన ఢిల్లీ క్యాపిటల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్‌ను వీక్షించేందుకు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి 65 మంది అనాథ పిల్లలకు అవకాశం కల్పించారు. భీమిలిలోని ఎస్ఓఎస్ సంస్థ నుంచి 45 మంది, గాజువాకలోని డిజైర్ సంస్థ నుంచి 20 మంది పిల్లలు ఈ మ్యాచ్‌ను చూశారు. పోలీస్ కమిషనర్ వారితో కలిసి కొంత సమయం గడిపారు. తమకు ఇంత మంచి అవకాశం కల్పించినందుకు పిల్లలు సీపీకి కృతజ్ఞతలు తెలిపారు. ఇది తమకు ఎంతో సంతోషాన్నిచ్చిందని వారు పేర్కొన్నారు.

బ్లాక్ టికెట్లు అమ్ముతున్న ఇద్దరి అరెస్ట్

మధురవాడ: ఐపీఎల్ మ్యాచ్‌కు సంబంధించి బ్లాక్ టికెట్లు అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను ఆదివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఐపీఎల్ మ్యాచ్ ప్రారంభం నుంచి బ్లాక్ టికెట్లు బయట వ్యక్తులకు చేరుతున్నాయనే వార్తలు గుప్పుమన్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం నుంచి క్రికెట్ స్టేడియం పరిసర ప్రాంతాల్లో పోలీసులు నిఘా పెట్టారు. అనుమానితుల కదలికలపై దృష్టి సారించారు. ఇద్దరు వ్యక్తులు అధిక రేట్లకు బ్లాక్‌లో టికెట్లు అమ్ముతున్నట్లు గుర్తించి, వారి వద్ద నుంచి 15 టికెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పీఎంపాలెం పోలీసులకు అప్పగించారు.